సాక్షి జగిత్యాల

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



ఎస్సారెస్పీకి భారీగా ఇన్‌ఫ్లో

జగిత్యాలరూరల్: ఎస్సారెస్పీలోకి 3,05,632 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 41 గేట్ల ద్వారా 3,58,254 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులో 1089.50 అడుగుల నీటిమట్టం ఉంది.



నిండుకుండలా మిడ్‌మానేరు

మిడ్ మానేరు నిండుకుండలా మారింది. పదిహేను రోజుల క్రితం బోసిపోయిన కనిపించిన ప్రాజెక్టు నేడు జలకళతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం 21 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి



మాట్లాడుతున్న సాలియా నాయక్

జగిత్యాలరూరల్: వర్షాలు కురుస్తున్న సమయంలో వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఈ సాలియా నాయక్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఈనెల 9వ తేదీ వరకు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో వినియోగదారులు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. తడిసిన విద్యుత్ స్టేవైర్లు, సపోర్ట్ వైర్లు, స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. వేలాడుతున్న, వదులుగా ఉన్న విద్యుత్ తీగలను తాకవద్దని సూచించారు. విద్యుత్ సమస్యలుంటే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలు వాయిదా

జగిత్యాలటౌన్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి నిర్వహించతలపెట్టిన జిల్లాస్థాయి పోటీలను వాయిదా వేస్తున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. పోటీలను తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని, మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలను ఈనెల 12వరకు నిర్వహించుకోవచ్చని సూచించారు. సందేహాలుంటే ఎస్జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరాంనాయక్‌ను 98490 19295 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇంకా శాంతించని గోదావరి



ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి

ధర్మపురి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు ధర్మపురి వద్ద గోదావరి ఉగ్రరూపంతో ప్రవహిస్తోంది. సంతోషిమాత, గడ్డహన్మండ్ల దేవాలయం, పుష్కరఘాట్లు, ద్యామంతుల గద్దె, శ్మశాన వాటికల మీదుగా ప్రవహిస్తోంది. భక్తులు లోనికి వెళ్లకుండా సీఐ రాంనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం వరకు కొంచెం శాంతించినట్లు కనిపించిన గోదావరి తిరిగి ఉధృతంగా ప్రవహిస్తోంది.

వసతులు త్వరగా పూర్తి చేయాలి



అంతర్గాంలోడబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద వసతులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులు త్వరలో ఇళ్లలోకి చేరేలా వసతులు కల్పించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలి

జగిత్యాల: సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాలకు చెందిన సిహెచ్.అఖిలకు రూ.12వేలు మంజూరు కాగా అందజేశారు. కౌన్సిలర్ గుగ్రం రాము పాల్గొన్నారు.


వైద్యసేవలపై గర్భిణులకు అవగాహన



వైద్యసిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సమియొద్దీన్

కథలాపూర్: ప్రభుత్వ వైద్యసేవలపై గర్భిణులు, బాలింతలకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో ఎండీ.సమియొద్దీన్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సిరికొండలో పల్లె దవాఖానలో గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గర్భిణులకు ప్రతినెలా పీహెచ్‌సీలల్లో వైద్య పరీక్షలు చేసి ప్రభుత్వాసుపత్రిలో ప్రసవమయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ శ్రీధర్, వైద్యసిబ్బంది చిన్న రాజం, అశోక్ ఉన్నారు.

భవితకు బాటసార్లు!



అమ్మ ఊపిరి పోస్తుంది. నాన్న నడక నేర్పిస్తాడు. గురువు జీవితాన్ని ఇస్తాడు. గురువు బోధనలే భవిష్యత్‌కు పునాదులు. మారుతున్న కాలానికి అనుగుణంగా బట్టీ చదువులను పక్కకు పెట్టిన టీచర్లు వినూత్న బోధనకు శ్రీకారం చుట్టారు. పుస్తకాలతో కుస్తీ పట్టకుండా ప్రయోగాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. పుస్తకంలోని పాఠాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతూ.. విద్యార్థుల్లో జ్ఞానాన్ని నింపుతున్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ డిజిటలైజేషన్‌లో ముందుకు సాగుతున్నారు. సర్కారు బడుల్లో ఉత్తీర్ణతశాతాన్ని పెంచుతూ విద్యార్థుల భవితకు బాటసార్లుగా నిలుస్తున్నారు. పాఠశాల దశలో వీరి బోధనలను అవపోసన పట్టిన పలువురు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..!!

- వివరాలు 8లో►

53 మంది విద్యార్థులతో ఆవిష్కరణలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధిస్తున్న సంపత్

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తున్న సంపత్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధించడం ఆయనకు అలవాటు. పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన సంపత్ చిన్ననాటి నుంచి ఇస్రోలో శాస్త్రవేత్త కావాలని కలలు కనేవారు. చివరికి ఎంపికైనా సాంకేతిక కారణాలతో తప్పుకో వాల్సి వచ్చింది. అయినా, ఆయన నిరుత్సాహ పడలేదు. తనకున్న తెలివితేటలతో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని భావించారు. మిషన్–100 లక్ష్యంతో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 53 మంది విద్యార్థులతో కొత్త ఆవిష్కరణలు చేయించారు. రిటైరయ్యేలోగా మరో 47 మందితో ఆవిష్కరణలు చేయిస్తానని ధీమాగా చెబుతున్నారు. ఆయన మూడుసార్లు పెద్దపల్లి జిల్లాస్థాయి, ఒకసారి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. 2022లో ఏటీపీపీ జాతీయ పురస్కారం, 2024లో సౌత్ ఇండియా టీచర్స్ సైన్స్ ఫెస్టివల్‌లో అవార్డు అందుకున్నారు.

పెద్దాపూర్ గురుకులం సిద్ధం

- బుధవారం నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడి
- మొదట పది, ఇంటర్ క్లాస్‌ల షురూకు నిర్ణయం
- విద్యార్థులు రాకపోవడంతో తర్జనభర్జన
- తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ సమావేశం
- విద్యార్థుల బాధ్యత తమదేనని భరోసా



పెద్దాపూర్ గురుకులం

మెట్‌పల్లిరూరల్: విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురికావడం.. ఇద్దరు విద్యార్థులు చనిపోవడం.. మరో నలుగురు అస్వస్థతకు గురికావడం వంటి వరుస సంఘటనల నేపథ్యంలో మూసివేసిన మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులం మరమ్మతులు పూర్తి చేసుకుని తరగతుల ప్రారంభానికి సిద్ధమైంది. బుధవారం నుంచే తరగతులు ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించినా.. కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. గురుకులం మూసివేసినప్పటి నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులను బోధించారు. ఈ లోపు పాఠశాలలో సౌకర్యాలు మెరుగు పరిచారు. వసతులు కల్పించారు. పనులు పూర్తికావడంతో కొద్దిరోజుల క్రితమే తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. విద్యార్థులు రాకపోవడంతో రెండుసార్లు వాయిదాపడింది. తాజాగా బుధవారం నుంచి తరగతులు పునఃప్రారంభించాలని నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం కూడా చేరవేశారు. అయితే కేవలం 23 మంది విద్యార్థులే వచ్చారు. వారితో తరగతులు ప్రారంభించలేదు. ఇలా మూడుసార్లు విద్యార్థులు రావాలన్ని కోరినా ఫలితం దక్కలేదు. గురువారం నుంచి క్లాస్‌లు షురూ చేయాలని అనుకుంటున్నప్పటికీ విద్యార్థులు వస్తారా..? లేదా..? వస్తే ఎంత మంది వస్తారు..? అని ఉపాధ్యాయులు తర్జనభర్జన పడుతున్నారు.

ముందుగా పది, ఇంటర్ తరగతులు

గురుకులంలో అభివృద్ధి, మరమ్మతు పనులు తుదిదశకు చేరకున్నాయని చెబుతున్నా.. అన్ని తరగతులను ఎందుకు ప్రారంభించడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతానికి పది, ఇంటర్ తరగతులు మాత్రమే పునఃప్రారంభించాలని నిర్ణయించారు. మిగతా తరగతులపై ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. కేవలం పది, ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులకే తరగతులు ప్రారంభిస్తున్నట్లు సమాచారం చేరవేశారు. అయినప్పటికీ కొందరు విద్యార్థులు మాత్రమే బుధవారం చేరుకున్నారు. ఇక్కడికి రావడానికి చాలామంది విముఖత చూపుతున్నట్లు తెలిసింది. ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ రావాలని కోరుతున్నారు.

వచ్చింది 23 మందే..

పది, ఇంటర్ తరగతుల వారు చాలా మంది ఉన్నా కేవలం 23 మందే హాజరయ్యారు. వీరందరూ ఇంటర్ విద్యార్థులే. ఫస్టియర్ విద్యార్థులు 20 మంది, సెకండియర్‌కు చెందిన ముగ్గురే వచ్చారు. పదవ తరగతి విద్యార్థులు ఒక్కరూ రాలేదు. వచ్చిన 23 మందిలో ముగ్గురు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు.

'మల్లన్న' మార్పు..

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు. ఆదివారం మెనూలో కొంత మార్పు చేశారు. గురుకులానికి కొద్ది దూరంలో మల్లన్న దేవాలయం ఉంది. ఇక్కడ జరిగే జాతరకు ఏటా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పెద్దాపూర్ గ్రామస్తులు ప్రతి ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామస్తులందరూ ఆ రోజు మాంసాహారానికి దూరంగా ఉంటారు. గురుకులంలోనూ ఈ ఆచారాన్ని అమలు చేయాలని ఎప్పటినుంచో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఘటనల నేపథ్యంలో ప్రతి ఆదివారం విద్యార్థులకు మాంసాహారం పెట్టొద్దని నిర్ణయించారు.



కొత్త భవనంలో టాయిలెట్స్



తరగతి గదుల్లో కిటికీలు, బిగించిన ఫ్యాన్లు

విద్యార్థుల భద్రతపై బాధ్యత తీసుకుంటాం



తల్లిదండ్రులతో సమావేశమైన ప్రిన్సిపాల్ మాధవిలత

మెట్‌పల్లిరూరల్: విద్యార్థుల భద్రత తమ బాధ్యత అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పెద్దాపూర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ మాధవిలత అన్నారు. గురుకులంలో విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశమయ్యారు. గురువారం నుంచి తరగతులు ప్రారంభిస్తామని, దసరా సెలవులకు మాత్రమే విద్యార్థులను ఇంటికి పంపిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే చాలారోజుల సమయం వృథా అయిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను మధ్యలో వచ్చి పలు పనుల నిమిత్తం ఇంటికి తీసుకెళ్లొద్దని సూచించారు. తరగతి, వసతి గదుల్లో సౌకర్యాలు, వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వసతి గృహాల్లో ప్రతిరోజు రాత్రి ఒక టీచర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. బుధవారం నుంచే తరగతులు ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించినా.. విద్యార్థులు సాయంత్రం వరకు రావడంతో గురువారం నుంచి తరగతులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ అశోక్‌కుమార్

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు శాఖ నిబంధనల మేరకు రెండు సౌండ్‌బాక్స్‌లు పెట్టుకోవాలని, మండపాల వద్ద శానిటేషన్ చేపట్టాలని సూచించారు. మున్సిపల్, పోలీసు, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 155 మంది గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, అంబు లెన్స్, మెడికల్ క్యాంప్, ఫస్ట్ ఎయిడ్ మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎస్పీ మాట్లాడుతూ విగ్రహాలను ఎప్పుడు నిమజ్జనం చేస్తారో వివరాలు ఇవ్వాలని, అవాంతరాలకు తావు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, డీఎస్పీ రఘుచందర్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కలెక్టర్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రెండు వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రసాయన విగ్రహాలతో చెరువులు కలుషితం అవుతాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 8 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయన్నారు. రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనకజ్యోతి, డీడబ్ల్యూవో నరేశ్ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

జగిత్యాల: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 25 మందిని ఎంపిక చేసినట్లు డీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరికి కలెక్టరేట్‌లో అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా లోకిని శ్రీనివాస్ (సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్), ఉత్తమ స్కూల్ అసిస్టెంట్లుగా బి.రాజేశం (దొంతాపూర్ ఎంపీపీఎస్), రాంరెడ్డి (పొరండ్ల ఎంపీపీఎస్), కాళీదాస్ (సంగంపల్లి ఎంపీపీఎస్), భీమయ్య (రామయ్యపల్లి ఎంపీపీఎస్), సురేశ్ (చెప్యాల జెడ్పీహెచ్‌ఎస్), కృష్ణహరి (కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్), వెంకటేశ్ (గోపాల్‌రావుపేట జెడ్పీహెచ్‌ఎస్), టి.శ్రీనివాస్ (ఖాజీపుర జెడ్పీహెచ్‌ఎస్), సయ్యద్ పాషా (మన్నెగూడెం జెడ్పీహెచ్‌ఎస్), కుమారస్వామి (మల్లన్నపేట జెడ్పీహెచ్‌ఎస్), శ్రీనివాస్, మనోజ్‌కుమార్, షేక్ ఆసిఫ్‌అలీ (పెగడపల్లి టీజీఎంఎస్), ఉత్తమ ఎస్జీటీలుగా సతీశ్ (దొంతాపూర్ ఎంపీపీఎస్), శ్రీకాంత్ (గొల్లపల్లి ఎంపీపీఎస్), అనూష (జైన ఎంపీపీఎస్), శ్రీనివాస్ (ఊటపల్లి ఎంపీపీఎస్), వినోద్‌గౌడ్ (హబ్సీపూర్ ఎంపీపీఎస్), రఘు (వాల్గొండ ఎంపీపీఎస్), జయంత్‌కుమార్ (తొంబరావుపేట ఎంపీపీఎస్), రమాదేవి, నాగరాణి (బీర్‌పూర్ ఎంపీపీఎస్), నరేశ్ కుమార్ (గుల్లకోట ఎంపీపీఎస్), రాజు(ముత్యంపేట ఎంపీపీఎస్) ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



లింగాపూర్ చెరువును పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. పెగడపల్లిలోని లింగాపూర్ పెద్ద చెరువును పరిశీలించారు. నీటి సామర్థ్యం, చెరువు కట్ట స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రమాదకరంగా ఉన్న చెరువుల కట్టల వద్ద ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వరద తాకిడి ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. శాలపల్లి–అడుపల్లి గ్రామాల మధ్యనున్న కల్వర్టును పరిశీలించారు. కల్వర్టుల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శోభ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తిరుపతి, సత్తిరెడ్డి, శేఖర్, నారాయణ, రమేశ్, సుధాకర్, విజయభాస్కర్, అనిల్‌గౌడ్, మహేందర్, వినోద్ పాల్గొన్నారు.

సహాయానికి కేంద్రం కలిసి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: భారీ వర్షాలతో రాష్ట్రంలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్రం ముందుకురావాలని, రూ.10వేల కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేసిన నేపథ్యంలో రూ.5వేల కోట్లను కేంద్రం గ్రాంట్‌గా మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మున్నేరు వాగు ఆక్రమణలే భారీ వరదలకు కారణమన్నారు. వరదలతో నష్టపోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. పదేళ్లలో ప్రజలను గాలికొదిలేసిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకుని ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌజ్ నుంచే ప్రకటనలు చేయడం, విదేశీ పర్యటనలో ఉన్న కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రంతో మాట్లాడి రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు చొరవ చూపాలన్నారు. హైడ్రా వంటి వ్యవస్థను జిల్లాలకు విస్తరిస్తామన్న సీఎం రేవంత్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, బండ శంకర్, గాజుల రాజేందర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, చందారాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన నీరు వచ్చినట్లే..



సారంగాపూర్:రూ.137 కోట్లతో నిర్మాణం చేసిన రోళ్లవాగు ప్రాజెక్టు పరిస్థితి అయోమయంగా మారింది. బీర్‌పూర్ శివారుల్లో నిర్మాణం చేసిన రోళ్లవాగు ప్రాజెక్టు కింద 20 వేల ఎకరాలకు సాగునీరందించడానికి ఆధునీకరించే కార్యక్రమం దాదాపు పూర్తి అయింది. అటవీశాఖకు చెందిన 900 ఎకరాల భూమి ముంపుకు గురికావడంతో అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాల్సి ఉంది. సాంకేతిక కారణాలతో భూముల కేటాయింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడు తూములకు గేట్లు బిగించాల్సి ఉంది. ఇంజనీరింగ్ అధికారులు తాత్కాలిక గేట్లు ఏర్పాటు చేసినా.. ప్రాజెక్టులోకి 300 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. తాత్కాలిక గేట్లు పనిచేయక వచ్చిన నీరు వచ్చినట్లే గోదావరిలో కలుస్తోంది.

జ్వరాల అదుపునకు చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్



జ్వరాలపై ఆరా తీస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల్లో జ్వరాల తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెంబట్లలో మూడు టీంలతో జ్వరాలపై ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇప్పటికే పలుమార్లు వైద్యశిబిరాలు నిర్వహించామని, గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ మంగళవారం మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. అయితే ఆయన మృతికి డెంగీ కారణం కాదని, జ్వరంతోపాటు ఫిట్స్ రావడం, గుండె సరిగా పనిచేయక పరిస్థితి విషమించిందని తెలిపారు. అనంతరం జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లలో రసాయనాలు పిచికారీ చేయించారు. 110 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 23 మందికి జ్వరం ఉన్నట్లు తేలడంతో వారి రక్తనమూనాలు సేకరించి టి హబ్‌కు పంపించినట్లు తెలిపారు. జ్వరాలు పూర్తి నియంత్రణలోకి వచ్చే వరకు పెంబట్లపై జిల్లా వైద్యశాఖ ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమారి, సీహెచ్‌వో కుద్దుస్, మలేరియా అధికారి సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటకు చెందిన రైతు ఏనుగుల మల్లయ్య(57) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. రోజు మాదిరిగానే ఉదయం పొలం వద్ద ఉన్న గేదెలపాలు పితికేందుకు వెళ్లి, అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. అక్కడే ఉన్న మల్లయ్య భార్య రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి): దొంగతుర్తి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి పొలగాని ఐలయ్య (50)చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ఈనెల 1న సాయంత్రం ఐలయ్య గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లి.. ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై అతివేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఐలయ్యకు మెడ, వెన్నుపూస, తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికు మారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విష జ్వరంతో రైతు మృతి

గొల్లపల్లి: భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఇత్తడి మల్లారెడ్డి (65) విషజ్వరంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మల్లారెడ్డి పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయినా జ్వరం తగ్గకపోగా ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దాడి చేశాడని మనస్తాపం..

- పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

మల్యాల(చొప్పదండి): మ్యాడంపల్లికి చెందిన తరాల లచ్చయ్య (50) అనే వ్యక్తి పురుగుల మందు తాగి మృతిచెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన గీకురు నారాయణ అనే వ్యక్తి తనను చెంపపై కొట్టడంతో అవమానంతో చనిపోతున్నట్లు లచ్చయ్య మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించిందని పేర్కొన్నారు. లచ్చయ్య మృతికి కారణమని భావిస్తూ నారాయణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు..?

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లికి చెందిన గన్నెబోయిన బాబు (52) మంగళవారం రాత్రి చేపలవేటకు వెళ్లి ఇంటికి రాలేదని ఎస్సై సీహెచ్ రవికిరణ్ తెలిపారు. చేపల వలతో చెరువు వద్దకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదని, అతడి కోసం బుధవారం వెతికినా ఆచూకీ లభించలేదని, బాబు భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గురుభ్యోనమః

- కాలానుగుణంగా బోధనలో మార్పులు
- విద్యార్థులతో మమేకమవుతున్న ఉపాధ్యాయులు
- ప్రయోగాత్మకంగా.. క్షేత్రస్థాయిలో పాఠాలు
- సర్కారు బడులకు ప్రాణం పోస్తున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉమ్మడి జిల్లా టీచర్లు
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిది. అలాంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ మన దేశ రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. కాలానుగుణంగా విద్యాబోధనలో మార్పులొస్తున్నాయి. టీచర్లు విద్యార్థులతో మమేకమవుతూ, ప్రయోగాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. జీవితంలో ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పిస్తూ వారి భవిష్యత్‌కు భరోసానిస్తున్నారు. నేడు నేషనల్ టీచర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆదిత్య

భవిష్యత్‌కు భరోసా



తిరుపతి

కరీంనగర్: హుజూరాబాద్ మండలంలోని కందుగుల జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్(సోషల్) ఓరుగంటి తిరుపతి విద్యార్థులతో ఫీల్డ్ విజిట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. వనరుల వినియోగం, చెరువుల సందర్శన, చేనేత కార్మికులు, జానపద కళాకారుల జీవన స్థితిగతులపై వారిని నేరుగా తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌గానూ చేశారు. సామాజిక రుగ్మతలు, సైబర్ నేరాలను పిల్లలకు వివరిస్తూ భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్నారు.

టీ–శాట్ బోధన



మార రమేశ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు దీక్ష పోర్టల్, ఐఎఫ్‌బీ ప్యానల్‌కు డిజిటల్ కంటెంట్ తయారు చేయడంతోపాటు టీ–శాట్ ఛానల్ ద్వారా బ్రిడ్జి కోర్సు విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించారు పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ మార రమేశ్. ఆయన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ప్రయోగాలతో బోధన



ప్రయోగంతో విద్యార్థులకు పాఠం చెబుతున్న చంద్రశేఖర్

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ సంక చంద్రశేఖర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం కావాలని ప్రయోగాలతో బోధిస్తున్నారు. ఈ ఉపాధ్యాయుడి ఆధ్వర్యంలో తయారు చేసిన స్పైరల్ స్క్రూ, నీళ్లను వేడి చేయడం, కుంభాకర కటకంతో ప్రతిబింబాలు అనే ప్రయోగాలు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ప్రయోగాలతో విద్యార్థులకు వివరిస్తే త్వరగా పాఠాలు అర్థమవుతాయని పేర్కొన్నారు.

సేవ.. బోధన.. రాష్ట్రస్థాయి గుర్తింపు



అంజన్‌కుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 10వ తరగతి బయోలాజికల్ సైన్స్‌లో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా సాంకేతికతను జోడిస్తూ బోధిస్తున్నారు. 2022లో విద్యారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో 80 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఎన్నికలకు మాస్టర్‌ట్రైనర్‌గా, విద్యా శిక్షణకు రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తూ.. ఉన్నతాధికారుల మన్ననలు పొందారు.

ఎనిమిదేళ్లుగా సెలవు తీసుకోలే..

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మోడల్ స్కూల్ ఇంగ్లిష్ పీజీటీగా పనిచేస్తున్న జి.ఆదిత్య ఎనిమిదేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు. డీఎస్సీ–2003 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచి మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచిని జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేశారు. 2011లో పీజీటీగా ఉద్యోగం సాధించి 2013 జూన్ 19న తిమ్మాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా చేరారు. ఏటా పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 100 శాతం ఫలితాలు సాధిస్తున్నారు. 2018లో రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. చాలామంది విద్యార్థులు పోలీసు, డిఫెన్స్ ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేశారు.

పాఠాలను కథలుగా చెబుతూ..



అనసూయ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఎడవల్లి అనసూయ విద్యార్థులకు కథల ద్వారా విద్యాబోధన చేయడం ద్వారా గుర్తింపు పొందారు. 1984లో ఎస్‌జీటీగా చేరి, 2002లో పదోన్నతి పొంది, ఎస్ఏగా పనిచేస్తున్నారు. పన్నెండేళ్లుగా నగునూరు స్కూల్లో విద్యార్థులకు కథల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. పుస్తకాలపై విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తున్నారు. దశాబ్దకాలంగా ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో తెలుగులో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిగా.. కాలమిస్టుగా



శంకర్ గౌడ్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన పాకాల శంకర్‌గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఎస్జీటీగా 1998లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన పాఠ్యాంశాల బోధనకు ప్రాధాన్యం ఇస్తూనే ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా, కాలమిస్టుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల సిరిసిల్లలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ సైన్స్)గా పని చేస్తున్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. 2020 కరోనా కాలంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించారు. డాక్టర్ల సహాయంతో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కరోనా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆయన గైడ్ టీచర్‌గా తయారు చేసిన పవర్‌లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషిన్ 2022–23లో ఇన్‌స్పైర్ మనాక్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది.

ఆర్పీగా టీచర్లకు సహకారం



రఘుపతిరావు

రామగుండం: సాదినేని రఘుపతిరావు ఉమ్మడి రామగుండం మండల రిసోర్స్ పర్సన్‌గా ప్రతీ బడిలో టీచర్లకు సంపూర్ణ సహకారం అందించారు. ప్రస్తుతం బ్రాహ్మణపల్లి యూపీఎస్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. బడిబయట ఉన్న పిల్లలను స్కూళ్లలో చేర్పించడం, వేసవి విద్యా శిబిరాల్లో ప్రత్యేక బోధన, వసతి గృహాల్లో తరగతుల నిర్వహణ, వలస కార్మికుల పిల్లల కోసం స్కూళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు.

సొంత ఖర్చుతో మరుగుదొడ్లు



యోగా నేర్పుతున్న రమేశ్‌గౌడ్

సుల్తానాబాద్: స్థానిక అశోక్‌నగర్ ఎంపీపీఎస్‌లో టీచర్‌గా పని చేస్తున్న బి.రమేశ్‌గౌడ్ కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు విద్యాబోధన చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా కొత్తగా మరో 50 మందిని చేర్పించాను. అందరికీ యోగా నేర్పిస్తున్నారు. సొంత ఖర్చుతో బాలికలకు, బాలురకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. పేద పిల్లలకు నోటుబుక్స్ ఇచ్చారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ పిల్లలకు హోంవర్క్ చేయించడంపై సూచనలు చేస్తున్నారు.

పేద పిల్లలను బడిలో చేర్పించా



హుజూరాబాద్‌రూరల్: నేను పని చేస్తున్న పాఠశాల చుట్టుపక్కల ఉండేది అందరూ నిరుపేదలే. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు. వారి జీవితాల్లో చదువు అనే వెలుగు లేకపోవడం వల్లే ఇన్ని ఇబ్బందులు పడుతున్నారని భావించాను. అందుకే వారి పిల్లలను బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో చేర్పించి, విద్యాబుద్ధులు నేర్పుతున్నాను. నాకు ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతోంది.

– బి.ప్రభాకర్, ఉత్తమ ఉపాధ్యాయుడు, గణేశ్‌నగర్

డిజిటల్ పాఠాల ప్రసారం



నందిని శ్రీనివాస్

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని కార్ఖానాగడ్డ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నందిని శ్రీనివాస్ డిజిటల్ పాఠాలకు రూపకల్పన చేశారు. వాటిని తెలుగు దళం చానల్ ద్వారా ప్రసారం చేశారు. వాటిని రాష్ట్రవ్యాప్తంగా 40 వేల నుంచి 50 వేల మంది విద్యార్థులు యూట్యూబ్‌లో వీక్షించారు. పిల్లలకు మంచి అలవాట్లు, భగవద్గీత శ్లోకాలు, పాటలు, ధ్యానం నేర్పించడానికి సంస్కార వారధి ద్వారా శిక్షణనిస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలు, మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చెందిన 2 వేల మందికిపైగా చిన్నారులు శిక్షణ పొందారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు



డా.పద్మావతి

కరీంనగర్ సిటీ: కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.పద్మావతి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. 1991లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీజీ, 2001లో ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి డాక్టోరియల్ డిగ్రీ పూర్తి చేశారు. ఆమె మార్గదర్శకత్వంలో ఇద్దరు విద్యార్థులకు డాక్టరేట్ పొందారు. పద్మావతి తెలుగులో 65 వ్యాసాలు, ఆంగ్లంలో 35 వ్యాసాలు రాశారు. సుకన్య సమృద్ధి యోజనపై ఐసీఎస్ఎస్ఆర్ స్పాన్సర్ చేసిన పరిశోధన ప్రాజెక్టుకు కో–డైరెక్టర్‌గా పని చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2 జాతీయ సెమినార్లు నిర్వహించారు.

జగిత్యాల మహిళా డిగ్రీ కాలేజీ ప్రొఫెసర్



ప్రమోద్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపికయ్యారు. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లికి చెందిన ఆయన కోరుట్లలో విద్యాభ్యాసం పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చేశారు. అధ్యాపక వృత్తి ఉంటూనే తెలుగు సాహిత్యంలో రాణిస్తూ రచనలు చేశారు. ప్రమోద్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

కరీంనగర్ ఎస్సారార్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్

కరీంనగర్‌సిటీ: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భూర్ల నరేశ్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా.వై.సత్యనారాయణ బుధవారం తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఆయన 2013 జనవరి 1న అప్పటి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా నియమితులయ్యారని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా కామర్స్ బోధిస్తూ పాఠ్యపుస్తక రచయితగా 5 పుస్తకాలను రచించారన్నారు. 20 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధన అంశాలు ప్రచురితమయ్యాయని తెలిపారు.

చిన్నారిపై వీధికుక్క దాడి



గాయపడిన శ్రీహన్షీ

చిగురుమామిడి: నవాబుపేట్‌కు చెందిన కక్కెర్ల శ్రీహన్షీ(5)పై వీధికుక్క బుధవారం దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. అంగన్‌వాడీ నుంచి సాయంత్రం ఇంటికి వస్తున్న చిన్నారిపై జెడ్పీ హైస్కూల్ ఎదుట కుక్క ఒక్కసారిగా దాడిచేసింది. స్థానికులు స్పందించి వీధికుక్కను తరిమేశారు. ఈ ఘటనలో చిన్నారి నుదిటిపై, వీపుపై తీవ్ర గాయాలైనట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు. బాలికను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే, తమ గ్రామంలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని గ్రామపంచాయతీ పాలకులకు గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం ప్రత్యేకాధికారికి విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. కుక్కల బెడద నుంచి గ్రామస్తులను కాపాడాలని మాజీ వార్డు సభ్యుడు సత్యనారాయణ, బోయిని సంపత్, సదానందం, బాబు, వంశీకృష్ణ, తదితరులు కోరారు.

నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నుస్తులాపూర్ గ్రామం మసీద్ సమీపంలో బుధవారం ఓ వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఎండీ ఎస్సై వివేక్, తిమ్మాపూర్ సీఐ స్వామి తెలిపిన వివరాలు.. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన రఘు(48) కరీంనగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. నగరంలోని శ్వేత హోటల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రఘు బుధవారం ఉదయం పదిగంటలకు ఇంటి నుంచి బయలుదేరిన రఘు నుస్తులాపూర్ శివారులో భార్యకి ఫోన్ చేసి ప్రసూన అని గట్టిగా అరిచి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే ఆమె కొడుక్కు విషయం చెప్పింది. అతను హోటల్‌లో ఆరా తీయగా ఐదు రోజులుగా విధులకు రావడం లేదని చెప్పగా లోకేషన్ యాప్ ద్వారా నుస్తులాపూర్ చేరుకున్నాడు. రోడ్డు పక్కన తండ్రి బైక్ కనిపించడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. దీంతో ఎల్ఎండీ పోలీసులు మల్లికార్జున్, సురేశ్ రఘు కోసం వెతకగా కాలిన గాయాలతో మృతిచెంది ఉన్నాడు. ఆత్మహత్య సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఎస్సై వేధింపుల వల్లే చాతిలో నొప్పి

- సింగిల్‌విండో మాజీ చైర్మన్ తీసుకున్న వీడియో వైరల్
- ఆస్పత్రిలో చేరిన బాధితుడు



ఆస్పత్రిలో భాస్కర్‌రెడ్డి

సైదాపూర్: ఎస్సై వేధింపులతో తాను భయాందోళనకు గురయ్యానని, చాతిలో నొప్పి వచ్చిందని, తనకు ప్రాణహాని జరిగితే ఆయనే బాధ్యుడంటూ బాధితుడు తీసుకున్న వీడియో వైరల్ అవుతోంది. బాధితుడు, స్థానికుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ జున్నూతుల భాస్కర్‌రెడ్డికి, అదే గ్రామానికి చెందిన మరొకరికి మధ్య రెండేళ్లుగా భూ తగాదా ఉంది. దీనిపై రెవెన్యూ అధికారులు, పోలీసులు గతంలోనే విచారణ చేపట్టారు. కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యంను జమ్మికుంటకు బదిలీ చేస్తూ సీపీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ బుధవారం ఉదయం గొడిశాలలోని భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి, పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు. తనకు జ్వరం వచ్చిందని, మధ్యాహ్నం వస్తానని ఆయన చెప్పారు. కానీ, ఎస్సై ఇప్పుడే రావాలంటూ వెంటపడి, పోలీస్ జీపు ఎక్కించే ప్రయత్నం చేశారు. భాస్కర్‌రెడ్డి మాత్రం తన కారులోనే బయలుదేరారు. సైదాపూర్ రాగానే వాంతులు చేసుకున్నారు. చాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపీ ట్యాబ్లెట్ ఇచ్చాడు. అనంతరం అంబులెన్సులో హుజూరాబాద్ తరలించారు. అక్కడినుంచి కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. కాగా, ఎస్సై వేధింపుల వల్లే చాతిలో నొప్పి వచ్చిందని, తనకు ప్రాణహాని జరిగితే ఆయనే బాధ్యుడంటూ భాస్కర్‌రెడ్డి వీడియో తీసుకున్నాడు. అది సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై ఎస్సై ఆరోగ్యంను ఫోన్‌లో వివరణ కోరగా.. భాస్కర్‌రెడ్డి తన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని గొడిశాలకు చెందిన మాదాడి జయ 2021లో ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదైందన్నారు. విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పానని, అప్పటికే జ్వరంతో ఉన్న భాస్కర్‌రెడ్డి తన కారులోనే సైదాపూర్ వచ్చాడని, స్టేషన్‌కు మాత్రం రాలేదని తెలిపారు.

నవవధువు ఆత్మహత్య

- ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదని..
- తన చావుకు ఎవరూ కారణం కాదంటూ..
- చేతిపై రాసుకుని ఉరేసుకున్న వైనం



భాగ్యలక్ష్మి

మల్యాల(చొప్పదండి): కాళ్లపారాణి ఆరకముందే నవ వధువు కాటికి చేరింది. ఏం జరిగిందో ఎవరికీ తెలియదు.. తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని, తన చావుకు తానే కారణమని తనువు చాలించింది. 'తాను ఎవరి కారణం వల్ల చనిపోవడం లేదు.. నన్ను ఎవరూ ఏమీ అనలేదు.. నాకే ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదు. అందుకే వెళ్లిపోతున్నా..' అంటూ చేతిపై రాసుకుని ఓ నవ వధువు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో విషాదం నింపింది.



అరచేతిపై రాసుకున్న సూసైడ్ నోట్

ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పానుటి భాగ్యలక్ష్మికి ఇదే మండలం మ్యాడంపల్లికి చెందిన ఉదయ్‌కిరణ్‌తో గతనెల 18న వివాహమైంది. అప్పటి నుంచి ఇద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఈనెల 3న భాగ్యలక్ష్మిని తల్లిదండ్రులు పుట్టినింటికి తీసుకొచ్చారు. బుధవారం తల్లిదండ్రులు మల్యాల వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాగ్యలక్ష్మి బాత్రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించారు. సంఘటనపై వివరాలు సేకరించారు. భాగ్యలక్ష్మి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

కుటుంబానికి ఆర్థిక భద్రత ముఖ్యం



చెక్కు అందజేస్తున్న టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు

కరీంనగర్: కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ లక్ష్యమని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణారెడ్డి అన్నారు. జ్యోతినగర్‌కు చెందిన అంతగిరి రాజు ఐదు సంవత్సరాల క్రితం టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ.5కోట్ల కవరేజ్ టర్మ్ పాలసీ తీసుకున్నారన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. రాజు భార్య శశికళకు రూ.5కోట్ల చెక్కును బుధవారం అందజేసినట్లు తెలిపారు. ఇన్సూరెన్స్, క్లెయిమ్ విషయంలో అపోహలు నమ్మొద్దని, నమ్మకమైన కంపెనీ నుంచి ఇన్సూరెన్స్ తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ వీరస్వామి, ఆదర్శ్‌కుమార్, సుమలత, చంద్రశేఖర్, ఆపరేషన్స్ మహేందర్, సీనియర్ పార్టనర్ నరేందర్‌రావు, లీడర్ శ్రీకాంత్, రాజు, సృజన్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కాల్‌నాయక్ తండాలో బుధవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఓ గుడిసె దగ్ధమైంది. తండాకు చెందిన శంకర్‌నాయక్–లలిత దంపతులు తమ కూతుళ్లు సంగీత, నందుతో కలిసి తాటికమ్మల గుడిసెలో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. నిత్యావసర వస్తువులు, విలువైన సామగ్రి కాలిపోయాయి. నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న అల్మాస్‌పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోనవేణి రాజయ్యయాదవ్, నాయకులు సిరిసిల్ల సురేశ్, శెట్టిపెల్లి బాలయ్య, రవినాయక్ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు.

విషజ్వరంతో బాలుడి మృతి

- కుటుంబంలో విషాదం



హనీశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విషజ్వరంతో బాధపడుతూ.. ఓ బాలుడు మృతిచెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కన్నకొడుకు మరణంతో ఆ దంపతులు గుండెలవిసెలా రోదించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన తుడుం రవళి–అజయ్ దంపతుల కుమారుడు హనీశ్(30 నెలలు) మంగళవారం జ్వరం బారిన పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, కరీంనగర్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీంతో ఆ తల్లి దండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో వెంటిలేటర్ ఉంటే తమ కొడుకు బతికేవాడని వారు రోదించడం కలచివేసింది. ఈ ఘటనపై మండల వైద్యాధికారిణి స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం వైద్యబృందం విచారణ చేపట్టింది. మృతుడు హనీశ్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి, మరణానికి దారితీసిన కారణాలు తెలుసుకున్నారు.